వన్ బై వన్


సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి

- కాంగ్రెస్‌కు క్యూ కడుతున్న బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు
- సీఎం సమక్షంలో కండువా కప్పుకున్న మహబూబ్‌నగర్ జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి
- ఇప్పటికే గద్వాల, మహబూబ్‌నగర్, వనపర్తి మునిసిపాలిటీల నుంచి చేరికలు
- ఎమ్మెల్సీ ఎన్నికల ముందు ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీసిన కాంగ్రెస్

మహబూబ్‌నగర్, మార్చి 20: కాంగ్రెస్ పొలిటికల్ గేమ్‌కు తెరతీసింది. ఇందుకు ఎమ్మెల్సీ ఎన్నికలను అస్త్రంగా వాడుకుంటోంది. ఎన్నికల ఫలితాలు వెలువడి, అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తాము చేరికలను ప్రోత్సహించబోమని చెప్పారు. ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పార్టీలోకి వస్తామని చెబుతున్నా.. ఎన్నికల్లో తమ విజయానికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలే తమకు ముఖ్యమని, వారి ప్రమేయం లేకుండా పార్టీలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. ఇంతలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో సీన్ మారింది. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడం, గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతుండటంతో ఇతర పార్టీల నుంచి ప్రజాప్రతినిధులను పార్టీలో చేర్చుకోవడం అనివార్యంగా మారింది. ఇదే అదనుగా ఆపరేషన్ ఆకర్ష్‌కు కాంగ్రెస్ తెరతీయడంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో అధికార పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో అధికంగా కౌన్సిలర్‌లు పార్టీ మారగా.. గద్వాల, వనపర్తి పురపాలిక కౌన్సిలర్‌లు కూడా అదేబాటపట్టారు. తాజాగా మహబూబ్‌నగర్ జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి.. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. కొంతకాలంగా బీఆర్ఎస్‌పై అసంతృప్తిగా ఉన్న ఆమె పార్టీని వీడారు. ఆమెతోపాటు ఎవరెవరు పార్టీని వీడతారో చూడాలి. మరోవైపు బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు మాత్రం స్వర్ణాసుధాకర్‌రెడ్డి పార్టీ మారే ముందు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ముందు..

ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 28న జరగనున్నాయి. అప్పటివరకు పూర్తి సంఖ్యాబలం సాధించాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉన్నది. ఎక్కడికక్కడ పార్టీలో చేరికలను ప్రోత్సహిస్తూ ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్‌లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తోంది. దాంతో బీఆర్ఎస్ శిబిరం రోజురోజుకు ఖాళీ అవుతుండగా, కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు 1,439 మంది ఉండగా.. విజయం సాధించాలంటే 720 ఓట్లు కావాల్సి ఉంది. ఈ సంఖ్య కోసమే ఇరు పార్టీలు పావులు కదుపుతున్నాయి. బరిలో ముగ్గురు అభ్యర్థులున్నా కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిల మధ్యనే పోటీ నెలకొననుంది. మండలాల వారీగా ప్రజాప్రతినిధుల లిస్ట్ తయారు చేసిన జిల్లా నాయకులు.. స్థానిక నాయకుల ద్వారా వారిని ఒప్పించి ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రి సమక్షంలో పార్టీ కండువా కప్పిస్తున్నారు. లేదంటే ఎన్నికల్లో ఓటేసేందుకు హామీ తీసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో భారీ విజయం నమోదు చేసుకుంటే.. ఆ వెంటనే జరిగే పార్లమెంట్ ఎన్నికలపై ఈ ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ కృషి చేస్తోంది. అదే సమయంలో తమకున్న కేడర్‌ను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ చెమటోడ్చాల్సి వస్తోంది. ఎన్నికల నాటికి పార్టీల సంఖ్యాబలాలు ఎలా మారతాయో చూడాలి మరి.

కాంగ్రెస్ చేరికల కమిటీ

ఆపరేషన్ ఆకర్ష్‌తో ఇప్పటికే ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటుండగా, తాజాగా మహబూబ్‌నగర్ అసెంబ్లీలో ఏకంగా చేరికల కమిటీనే ఏర్పాటు చేశారు. 10 మంది సభ్యులతో ఈ కమిటీని నియమించారు. ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకోవడమే లక్ష్యంగా ఈ కమిటీ పని చేస్తుంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున చేరికలను ప్రోత్సాహిస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు 10 మంది సభ్యులతో డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఈ కమిటీని నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. కమిటీ కన్వీనర్‌గా సీనియర్ నాయకుడు చంద్రకుమార్‌గౌడ్, కో కన్వీనర్‌గా అబ్దుల్ సిరాజ్‌ఖాద్రి, సభ్యులుగా ఎస్ వినోద్ కుమార్, ఆనంద్‌కుమార్‌గౌడ్, ఎన్‌పీ వెంకటేశ్, సంజీవ్‌ముదిరాజ్, ఎం.సురేందర్‌రెడ్డి, బెక్కరి అనితారెడ్డి, సి.అమరేందర్‌రాజు, లక్ష్మణ్‌యాదవ్ ఉన్నారు.

అక్కడ సగం.. ఇక్కడ సగం

- రెండుగా చీలిపోయిన వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం
- కొత్త కలెక్టరేట్‌లోకి పరిపాలన విభాగం
- పాత కార్యాలయంలోనే మందులు, వ్యాక్సిన్ స్టోర్స్
- విధి నిర్వహణలో భాగంగా రెండు చోట్లకు తిరుగుతున్న సిబ్బంది
- కొత్త కార్యాలయంలో ఇరుకు క్యాబిన్లతో ఇబ్బందులు
- పాత భవనంలోకే మార్చాలంటున్న ఉద్యోగులు


నూతన కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ విభాగం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మార్చి 20: మహబూబ్‌నగర్ జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం రెండుగా చీలిపోయింది. కొత్తగా నిర్మించిన సమీకృత కలెక్టర్ భవనంలోకి పరిపాలన విభాగాన్ని మార్చగా, పాత డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలోనే మందులు, వ్యాక్సిన్, ల్యాబ్‌ల విభాగాలు ఉండిపోయాయి. దాంతో కొత్త కార్యాలయంలో ఇరుకు క్యాబిన్‌లలో విధులు నిర్వర్తిస్తూ అటు అధికారులు, ఇటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకచోట సమావేశాలు ముగించుకొని.. మరో చోటకు వెళ్లి మందులు, వ్యాక్సిన్‌లు తీసుకోవాలంటే ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొత్త కార్యాలయంలో సమావేశాల ఏర్పాటుకు, కార్యాలయ నిర్వహణకు అన్ని శాఖలు డబ్బులు ఫిక్స్ చేయడంతో ఆర్థిక సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. తమను పాత కార్యాలయంలోనే కొనసాగించాలని ఉద్యోగులు, సిబ్బంది మొరపెట్టుకున్నా జిల్లా యంత్రాంగం పెడచెవిన పెడుతోంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని పాత జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా మహబూబ్‌నగర్‌లోనే డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయాన్ని సమీకృత కలెక్టరేట్ భవనంలోకి మార్చడం విశేషం. పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పాత కార్యాలయంలోకి మార్చాలని ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.

2005లో పాత కార్యాలయ నిర్మాణం..


పాత కార్యాలయంలో బయట నిలిపిన అంబులెన్సులు, వాహనాలు

అన్ని ప్రభుత్వ శాఖల్లో అతి పెద్దది వైద్య ఆరోగ్యశాఖ. దానికి అనుగుణంగా ఒక కార్యాలయం ఉండాలనే ఉద్దేశంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో వైద్య ఆరోగ్య శాఖకు భవనాన్ని నిర్మించింది. మొత్తం మూడు అంతస్తుల్లో మొదటి అంతస్తులో వ్యాక్సిన్, డ్రగ్ స్టోర్స్, రెండో అంతస్తులో పరిపాలన విభాగం, మూడో అంతస్తులో మీటింగ్ హాల్స్, మాలేరియా ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు డిజైన్ చేసి మరీ నిర్మించింది. ఆ ప్రకారమే వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాలు కొనసాగుతున్నాయి.

కొత్త సమీకృత కలెక్టరేట్‌లోకి కార్యాలయం..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్ల క్రితం జిల్లాలో సమీకృత కలెక్టరేట్ భవనాన్ని నిర్మించింది. అందులోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండాలని నిర్ణయించింది. ఈమేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని కూడా ఆ భవనంలోకి మార్చింది. కానీ.. ఇక్కడే సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ భవనం చాలా చిన్నదిగా ఉంది. అందులో ఒక హాల్‌ను జిల్లా కార్యాలయానికి కేటాయించారు. అందులో కొన్ని క్యాబిన్‌లు తయారు చేయించి, ఆయా విభాగాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యాలయం ఏమాత్రం సరిపోవడం లేదు. చిన్న చిన్న క్యాబిన్‌లు ఏర్పాటు చేయడంతో ఇరుకుగా మారాయి. ఉద్యోగులు, సిబ్బంది కూర్చోవడానికి సైతం స్థలం ఉండటం లేదు. కొన్ని విభాగాలకు స్థలం సరిపోకపోవడంతో ఒక్కో క్యాబిన్‌లో రెండు విభాగాలు కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది.

సమావేశాలు నిర్వహించాలంటే డబ్బులు..

వైద్య ఆరోగ్యశాఖలో రోజూ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న కార్యాలయంలో సమావేశాలు నిర్వహించాలంటే డబ్బులు చెల్లించాలి. అంతేకాకుండా కార్యాలయం నిర్వహణకు సైతం ప్రతీనెల డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక సమావేశం ఏర్పాటు చేస్తే 150 నుంచి 200 మంది వరకు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది వస్తుంటారు. అలాంటి సందర్భంలో ప్రస్తుతం ఉన్న సమావేశ మందిరం కూడా సరిపోవడం లేదు.


పాత కార్యాలయంలోని డ్రగ్ స్టోర్

ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు..

వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని రెండుగా చీల్చడంతో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సమావేశాలకు కొత్త కార్యాలయానికి వెళ్లి.. వ్యాక్సిన్, మందులు తీసుకోవడానికి తిరిగి పాత కార్యాలయానికి వస్తున్నారు. ఏదైనా ఐఈసీ మెటీరియల్ తీసుకోవాలన్నా, మలేరియాకు సంబంధించిన టెస్టులు చేయించుకోవాలన్నా పాత కార్యాలయానికే రావాల్సి ఉంది. ఈ క్రమంలో రవాణా ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని వాపోతున్నారు. కొందరు సిబ్బంది కూడా పాత కార్యాలయంలోనే ఉన్నారు. దాంతో వివిధ అవసరాల నిమిత్తం అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి రోజూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత కార్యాలయంలోనే మిగతా విభాగాలు..

కొత్త కలెక్టరేట్‌లోకి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని మార్చినప్పటికీ.. పాత కార్యాలయంలో చాలా విభాగాలు ఉన్నాయి. దాదాపు 30 ఏళ్లకు సంబంధించిన రికార్డులు ఒక గదిలో ఉన్నాయి. పిల్లలకు సంబంధించిన వ్యాక్సిన్‌లు, వాటికి సంబంధించిన ఫ్రిజ్‌లు, పీహెచ్‌సీలకు సరఫరా చేసే డ్రగ్ స్టోర్, మలేరియా ల్యాబ్ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ వాహనాలు, అంబులెన్స్‌లు, దోమలకు పిచికారి చేసే స్ప్రే రసాయనాల డ్రమ్ములు, ఆరోగ్యశ్రీ విభాగం అక్కడే ఉన్నాయి. అదేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లు, ఇతర పుస్తకాలు, ఐఈసీ మెటీరియల్ సైతం పాత కార్యాలయంలోనే ఉన్నాయి. 150 నుంచి 200 మందికి సమావేశాలు నిర్వహించేందుకు సరిపడా మీటింగ్ హాల్, అధికారులు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఏసీ కాన్ఫరెన్స్ హాల్ కూడా అక్కడే ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణం, పెద్ద పెద్ద గదులతో కార్యాలయం ఇప్పటికి కొత్తగానే ఉంది.

ఒక్క పాలమూరులోనే కొత్త భవనంలో..

రాష్ట్రంలోని అన్ని పాత జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాలు పాత కార్యాలయ భవనంలోనే కొనసాగుతున్నాయి. రంగారెడ్డి, నల్గొండ, సంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో కొత్త కలెక్టరేట్‌లు నిర్మించినప్పటికీ.. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయాలను అందులోకి షిఫ్ట్ చేయలేదు. కానీ పాలమూరు జిల్లాలోనే పాత కార్యాలయాన్ని ఖాళీ చేసి కలెక్టరేట్‌లోకి మార్చారు. అప్పటి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటబడి మరీ ఖాళీ చేయించారు.

పాత కార్యాలయంలోకి మార్చాలని ఉద్యోగుల డిమాండ్

కొత్త భవనంలో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పాత భవనంలోకి తమ కార్యాలయాన్ని మార్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాదాపు 80 మంది ఉద్యోగులు సంతకాల సేకరణ చేసి, అప్పటి కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఇలా ముందుకు వచ్చిన వారిపై ఒత్తిడి తెచ్చి ఆ డిమాండ్‌ను లేవనెత్తకుండా చేశారు. కనీసం ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖను పాత కార్యాలయంలోకి మార్చాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.


పాత డీఎంహెచ్‌వో కార్యాలయం

తహసీల్‌లో మహిళల హల్‌చల్

- తమ భూమి తమకు ఇవ్వాలని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం


పెట్రోల్ చల్లుకుంటున్న మహిళలు

అయిజ, మార్చి 20 : తమ భూమి తమకు ఇప్పించాలని జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఐదుగురు మహిళలు పెట్రోల్‌తో హల్‌చల్ చేశారు. తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తహసీల్దార్‌పై పోసి తమపై చల్లుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. అయిజ మండలం బింగిదొడ్డి గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్ 139లో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని అయిజ పట్టణానికి చెందిన రామేశ్వరమ్మ, సుభద్రమ్మ, గోవిందమ్మ, లక్ష్మీదేవి, రోహిణమ్మలకు రెండు ఎకరాల చొప్పున ప్రభుత్వం గతంలో ఇచ్చింది. సాగులో లేనందున ఆ భూమిని రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు, మరి కొందరికి తిరిగి కేటాయించారు. అయితే ఆ భూమిని తిరిగి తమ పేరున రికార్డుల్లో నమోదు చేయాలని ఆరు సంవత్సరాలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమను ఎవరూ పట్టించుకోవటం లేదని తహసీల్దార్‌తో ఆ ఐదుగురు మహిళలు బుధవారం వాదనకు దిగారు. తమతో బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను తహసీల్దార్ జ్యోతిపై పోసి తమపై కూడా చల్లుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. తాను ఈ మధ్యనే బాధ్యతలు తీసుకున్నానని, విచారించి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా మహిళలు తమ వెంట తెచ్చుకున్న బాటిల్‌లో ఉన్న పెట్రోల్‌ను తమపై పోసుకున్నారు. అనంతరం ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఎస్ఐ విజయ్‌భాస్కర్ ఘటనా స్థలానికి వచ్చి విచారించారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ఘటనపై పోలీసులకు వివరిస్తున్న తహసీల్దార్ జ్యోతి

నాపై పెట్రోల్ పోశారు : తహసీల్దార్ జ్యోతి

ప్రణాళిక ప్రకారం పెట్రోల్‌తో వచ్చిన మహిళలు నచ్చచెప్పినా వినలేదు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా తాను ఇక్కడికి బదిలీపై వచ్చానని. మీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే ప్రయత్నం చేస్తాను అని చెప్పినా వినలేదని జ్యోతి చెప్పారు. వారు ముందస్తుగా తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తనపై చల్లారని, తర్వాత వారిపై చల్లుకున్నారని చెప్పారు.

ఊపిరి పోసిన నర్సు

బోల్తా పడిన ఆటో.. భయంతో బతుకుజీవుడా అంటూ అందులో ఉన్న చిన్నారుల పరుగులు.. ఓ బాలుడు మాత్రం అలాగే రోడ్డుపై పడిపోయాడు.. కొందరు చూపరులు వచ్చి చనిపోయాడులే అనుకొని ఎవరి దారిలో వారు వెళ్లిపోయారు.. ఆ దృశ్యం అదే దారిలో వెళుతున్న ఓ నర్సమ్మ కంటపడింది. మాతృత్వం మనసును కదిలించింది.. తనకు సంబంధం లేకున్నా ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే వృత్తి ధర్మం గుర్తుకొచ్చింది.. అంతే అందరూ చనిపోయాడని వదిలేసిన ఆ బాలుడికి ఊపిరి పోసిన ఆమెను చూసి అందరూ కృతజ్ఞతగా చేతులు జోడించారు.


అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలుడికి సీపీఆర్ చేస్తున్న ఏఎన్ఎం భారతి


ఏఎన్ఎం భారతి

ఈ ఘటన బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం రాయపురం స్టేజి దగ్గర చోటుచేసుకున్నది. మండల కేంద్రానికి చెందిన కొంతమంది చిన్నారులు ఈతకు వెళ్లి తిరిగి వస్తున్న వారి ఆటో రాయపురం స్టేజీ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న చిన్నారులు భయంతో పరుగులు పెట్టారు. మల్లేష్ అనే బాలుడు మాత్రం అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడకు చేరినవారంతా చనిపోయాడని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం కూడా చేయలేదు. అదే సమయంలో అలూరు నుంచి గట్టుకు వెళుతున్న ఏఎన్ఎం భారతి బాలుడిని గమనించి దగ్గరకు వెళ్లింది. సీపీఆర్ చేసి శ్వాసను అందించడంతో బాలుడు స్పృహలోకి వచ్చాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి గట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గద్వాల అసుపత్రికి తరలించారు. చనిపోయాడని భావించి వదలేసిన బాలుడి ప్రాణాలను కాపాడిన ఏఎన్ఎం భారతిని పలువురు అభినందించారు. బాధిత కుటుంబ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

- గట్టు

పీఎం జన్‌మన్ గృహాల కోసం ఎదురు చూపులు

- సర్వేలకే పరిమితమైన పథకం
- ఐటీడీఏ పరిధిలో 1,000 మంది చెంచు లబ్ధిదారుల గుర్తింపు


ఈర్లపెంటలో పూరిగుడిసెలో నివాసం ఉంటున్న చెంచులు

మన్ననూర్, మార్చి20: నల్లమల అభయారణ్యంలోని ఆదివాసీ గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పక్కా గృహాల నిర్మాణ పథకం పీఎం జన్‌మన్ సర్వేలకే పరిమితమైంది. ఈ పథకంలో గృహాలు ఎప్పుడిస్తారోనని నల్లమల చెంచులు ఎదురు చూస్తున్నారు. నెలన్నర క్రితం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా ఉన్న చెంచులతో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. మన్ననూరు ఐటీడీఏ పరిధిలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, పరిగి, వికారాబాద్ జిల్లాల చెంచులందరినీ మన్ననూరుకు తరలించి, పీటీజీ పాఠశాల ఆవరణలో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆధార్, ఆయుష్మాన్ భారత్ కార్డుల ప్రక్రియతో పాటు పక్కా గృహాలు నిర్మించుకుంటే చెంచు లబ్ధిదారుల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తామని ప్రధాన మంత్రి ప్రకటించారు. మన్ననూరులో నిర్వహించిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలకు చెంచులు పిల్లాపాపలతో అధికంగా తరలొచ్చి.. కార్డులు లేని వారందరూ నమోదు చేసుకున్నారు. చెంచులు 75 శాతానికి పైగా ఆధార్ కార్డులు దిగే ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. ఇదే క్రమంలో పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. ఐటీడీఏ పరిధిలోని అప్పాపూర్, పుల్లాయపల్లి, భౌరాపూర్ పెంటల్లో మాత్రం ఐటీడీఏ ఆధ్వర్యంలో గుత్తేదారులతో ప్రీఫాబ్రికేటెడ్(పర్యావరణ హిత) పక్కా గృహాల నిర్మాణం జరుగుతోంది. నల్లమలలోని రాంపూర్, ఆగర్లపెంట, సంగిడి గుండాల, ఈర్లపెంట, కొమ్మన పెంట, కొల్లం, రాయలేటిపెంట తదితర చెంచు పెంటలకు రహదారి సైతం లేదు. పూరి గుడిసెల్లోనే చాలా ఏళ్లుగా నివసిస్తున్నారు. యేటా వేసవిలో అడవిలో కార్చిచ్చు ఏర్పడే క్రమంలో చెంచుల పూరి గుడిసెలు అగ్నికి దగ్ధమౌతూ, సర్వం కోల్పోతున్నారు. ఈ మధ్యకాలంలో మేడిమొల్కల, సంగిడి గుండాల పెంటల్లో చెంచుల రెండు పూరి ఇండ్లు కార్చిచ్చు కారణంగానే దగ్ధమయ్యాయి.

1000 లబ్ధిదారుల గుర్తింపు

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఐటీడీఏ యంత్రాంగం చెంచుపెంటలు, గూడేల్లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. సర్వేలో పక్కా గృహాలు అవసరం ఉన్నవారు వెయ్యికిపైగా ఉన్నట్లు గుర్తించారు. నివేదికను అధికారులు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా జన్‌మన్ పథకం సభ్యులకు పంపించారు. కానీ నేటి వరకు ఆ గృహ నిర్మాణాలు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో ఎన్నికలు ముగిసిన తర్వాతైనా గృహాలు నిర్మించాలని చెంచులు కోరుతున్నారు.

జాబితాను పంపించాం

సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా పక్కా గృహాలు అవసరం ఉన్న 1,000 మంది లబ్ధిదారుల జాబితాను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖను పంపించాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాక జాబితాలో ఉన్న చెంచులందరికీ ఇళ్లు నిర్మించేందుకు ఐటీడీఏ కృషి చేస్తుంది.

- ఎండీ జాఫర్ హుస్సేన్, ఐటీడీఏ కార్యాలయ ఏవో, మన్ననూరు

ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం

మాది మారుమూల ఆగర్లపెంట. తొమ్మిది కుటుంబాలం నివసిస్తున్నాం. ఫాబ్రికేటెడ్ ఇళ్లు మాకు ఇవ్వలేదు. జన్‌మన్ పథకంలో ఇళ్ల మంజూరుకి దరఖాస్తు చేసుకున్నాం. వేసవి వచ్చిందంటే మా పూరిళ్లు కాలిపోతూ ఉంటాయి. ఇటీవలె మా పెంట పరిధిలో కార్చిర్చు జరిగింది. ఇళ్లు నిర్మించి, మమ్మల్ని ఆదుకోవాలి.

- సలేశ్వరం, ఆగర్ల పెంట

సారా అమ్ముతున్న మహిళపై కేసు నమోదు

గోపాల్‌పేట, మార్చి 20 : వనపర్తి జిల్లా ఏదుల గ్రామంలో సారా అమ్ముతున్న మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుందేల బయమ్మ కొంతకాలంగా తన ఇంట్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా సారా విక్రయిస్తోంది. బుధవారం మధ్యాహ్నం పోలీసులు పక్కా సమాచారంతో గ్రామానికి వెళ్లి ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించగా ఏడు లీటర్ల సారా లభ్యమైంది. సారాను స్వాధీనం చేసుకొని పంచనామా అనంతరం బయమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన కందూరు రామలింగేశ్వరాలయం

అడ్డాకుల, మార్చి 20 : మహబూబ్‌గర్ జిల్లాకు తలమానికంగా వెలుగొందుతున్న అడ్డాకుల మండలంలోని కందూరులో దక్షిణ కాశీగా పిలువబడుతున్న శైవక్షేత్రం కందూరు రామలింగేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈనెల 21 ఫాల్గుణశుద్ధ ద్వాదశి గురువారం నుంచి 26వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఎండోమెంటు అధికారులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 21వ తేదీన ధ్వజారోహణం, 22న కల్యాణోత్సవం, 23న ప్రభోత్సవం, అశ్వ వాహనసేవ, 24న రథోత్సవం, 25న వృషభ వాహనసేవ, 26న తీర్థావళి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్చ అవసరం

- పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్
- కల్వకుర్తి డిగ్రీ కళాశాలలో భారతదేశ నూతన విద్యావిధానం అమలు - సుస్థిర అభివృద్ధిపై సెమినార్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రాథోడ్

కల్వకుర్తి, మార్చి 20 : నూతన విద్యావిధానం, విద్యా వ్యవస్థ బలోపేతానికి విస్తృత స్థాయి చర్చ అవసరమని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'నూతన విద్యా విధానం-సుస్థిర అభివృద్ధి'పై రెండు రోజుల పాటు జరిగే సెమినార్‌ను పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ ప్రారంభించారు. కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శర్వాణీ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు పీయూ వీసీతో పాటు, ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి, ఐసీఎస్ఎస్ఆర్ మాజీ డైరెక్టర్ చెన్న బసవయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీయూ వీసీ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యావిధానంలో ఉన్న మెరిట్‌లు, డీమెరిట్లతో పాటు నూతన విద్యా విధానంలో అమలుపర్చనున్న కర్కులమ్‌తో సెమినార్‌లో విద్యార్థులను మమేకం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఒకే విద్యావిధానం అమల్లో భాగంగా అమలుచేస్తున్న నూతన విద్యా విధానం వల్ల చేకూరే లాభాలు, నష్టాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేందుకే సెమినార్లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కౌన్సిల్ తీర్మానం అమలు చేస్తే కల్వకుర్తి డిగ్రీ కళాశాలకు బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేసేందుకు రూ.25లక్షల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సౌత్ఎర్న్ రీజినల్ సెంటర్(ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ) హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ చెన్నబసవయ్యలు నూతన విద్యా విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 2020 నూతన విద్యా విధానం సాధించాల్సిన లక్ష్యాలు, నూతన విద్యావిధానంపై ప్రపంచీకరణ విధానం, ఉన్నత చదువులు, నాయకత్వ లక్షణాలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమతుల్యత, లింగ సమానత్వం, పలు అంశాలపై వివరించారు. అంతకుముందు కళాశాల విద్యార్థులు అధ్యాపకులకు, ముఖ్య అతిథులకు స్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హెచ్.మల్లేష్, అధ్యాపకులు సైదులు, మల్లేష్‌యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు డీకే అరుణ ఫోన్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

- ఆ పార్టీ కార్యకర్తలపై విశ్వాసం లేక మద్దతు ఇవ్వాలని హస్తం కార్యకర్తలను కోరుతున్న నాయకురాలు
- తాను ఒక్క బీజేపీ కార్యకర్తకు ఫోన్ చేసినట్లు చూపితే పోటీ నుంచి తప్పుకుంటా
- మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 20 : తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై విశ్వాసం లేక మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ పొద్దున లేస్తే కాంగ్రెస్ కార్యకర్తలకు ఫోన్ చేసి తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారని, దీన్ని బట్టి తమ పార్టీ నైతికంగా విజయం సాధించినట్లేనని స్పష్టమవుతోందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని క్రౌన్ ఫంక్షన్ వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు అధికంగా కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వంశీచంద్‌రెడ్డి మాట్లాడారు. ఒక పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తూ మరో పార్టీ కార్యకర్తలను మద్దతు అడుగుతున్నారంటేనే బీజేపీ ఓటమి ఖాయమైందన్న విషయం స్పష్టమతోందని చెప్పారు. ఇప్పటివరకు తాను ఒక్క బీజేపీ కార్యకర్తకు, నాయకుడికి ఫోన్ చేసినట్లు చూయిస్తే తాను పోటీ నుంచి తప్పుకుంటానని, ముక్కు నేలకు రాస్తానని అన్నారు. ఇదివరకు తాను కాంగ్రెస్‌లోనే పనిచేశానని, తనకు మద్దతివ్వాలని కోరడం దారుణమన్నారు. పూటకో పార్టీ మారుతూ విలువలను పక్కనపెట్టి, పదవుల కోసం ఎలాగైతే ఆమె కండువాలు మారుస్తుందో.. అలాగే కాంగ్రెస్ కార్యకర్తలు విలువలు వదిలేసి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరడం సరైందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఎందరికి ఫోన్ చేశారో తాను చూయిస్తానన్నారు. ఇలాంటి రాజకీయాలు చేయడానికి సిగ్గుండాలన్నారు. డీకే అరుణ కాదు.. నరేంద్రమోదీ వచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు ఈ జెండాను వదిలిపెట్టరని, మీలా అమ్ముడుపోయేవాళ్లు కాంగ్రెస్‌లో లేరని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుత ఎంపీ అని చాలా మందికి తెలియదన్నారు. పనిచేయని, కనిపించని ఎంపీని పాలమూరు ప్రజలు ఆదరించరని, ఆయన పోటీనే కాదని తేల్చిచెప్పారు.

టీవీలలోనే మోదీ దర్శనం: ఎమ్మెల్యే యెన్నం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దర్శనం టీవీలలోనే తప్ప.. బయట ఎవరికీ అందుబాటులో ఉండరన్నారు. బీజేపీలో పెద్ద నాయకులకు కూడా ఆయన దర్శనం దొరకదని చెప్పారు. మహబూబ్‌నగర్ ఇన్నాళ్లూ వివక్షకు గురైందని, ఇకనైనా అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. సంగంబండ తొలగిస్తే 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఈ విషయంలో బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ విషయాన్ని పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లగానే మూడు నెలల్లో నిధులు మంజూరుచేశారని గుర్తు చేశారు. సంగంబండ పగిలిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజాపాలన ద్వారా సీఎం రేవంత్ అందరి అభిమానాలను గెలుచుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అసలు పోటీనే కాదన్నారు. బీజేపీతోనే తమకు పోటీ అన్నారు. భారీ మెజారిటీతో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు వినోద్‌కుమార్, ఎం సురేందర్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్, సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రి, బెనహర్, లక్ష్మణ్‌యాదవ్ ఫయాజ్. సుధాకర్‌రెడ్డి, మహేందర్, మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి వట్టెం వెంకన్న స్వామి బ్రహ్మోత్సవాలు

బిజినేపల్లి, మార్చి 20 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలోని అడ్డుగుట్టపై వెలిసిన భూదేవి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ వ్యవస్థాపక సభ్యుడు సందడి ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. 22వ తేదీన స్వామివారికి అలంకారం, రాజభోగ నివేదన, తీర్థప్రసాద గోష్టి, 23న త్రయోదశి శనివారం సంతానార్థులకు గరుడ ప్రసాద వితరణ, 24న చతుర్థశి ఆదివారం ఉత్సవులకు నవకలశ స్నపన తిరుమంజనం, 25న పౌర్ణమి సోమవారం శ్రీవారి కల్యాణం, 26న పాడ్యమి మంగళవారం నవకలశ స్నపనం, చివరి రోజు 27న ఉత్సవమూర్తులకు చక్రతీర్థంతో ఉత్సవాలు ముగియనున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల పాటు సాగే ఆలయ బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య


బోయ రాజు (ఫైల్)

భూత్పూర్, మార్చి 20 : ఆర్థిక ఇబ్బందులను భరించలేక భార్యతో తగువులాడి మనస్తాపానికి లోనై ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం పాత మొల్గరలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయరాజు(36) ఆర్థిక ఇబ్బందుల కారణంగా గత కొన్ని రోజులుగా భార్య వరలక్ష్మీతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం కూడా బోయరాజు భార్యతో గొడవ పడ్డాడు. క్షణికావేశంలో గ్రామ శివారులో ఉన్న సొంత వ్యవసాయ పొలంలో నీలగిరి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..


స్వామి (ఫైల్)

అమ్రాబాద్ మార్చి 20 : నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల పరిధిలోని వంకేశ్వరం గ్రామానికి చెందిన ఎలకచేను స్వామి (26) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. స్వామి ఇటీవలే ఇల్లు నిర్మించుకున్నాడు. ట్రాక్టర్‌ను కూడా కొనుగోలు చేశాడు. దీంతో రూ.ఆరు లక్షల అప్పులు అయ్యాయి. ఈ విషయమై మంగళవారం రాత్రి ఇంటి వద్ద కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన స్వామి బుధవారం తెల్లవారుజామున తన వ్యవసాయ పొలం దగ్గర చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పదర పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అమ్రాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అచ్చంపేట ఎమ్మెల్యేడాక్టర్ వంశీకృష్ణ ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

తెలకపల్లి, మార్చి 20 : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని పెద్దచెరువు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై బి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పెద్దచెరువు వెనక కంపచెట్లలో గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందినట్లు బుధవారం స్థానికులు గుర్తించి తమకు సమాచారమిచ్చారన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా వ్యక్తి మూడురోజుల క్రితం మృతి చెందినట్లు తెలుస్తోందని, మృతదేహం కుళ్లిపోయి ఉందని తెలిపారు. పూర్తి సమాచారం కోసం ప్రయత్నిస్తున్నామని, సంబంధీకులు ఉంటే తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై పేర్కొన్నారు.

పర్సనల్ లోన్ ఇప్పిస్తానంటూ మోసం

జడ్చర్ల, మార్చి 20 : పర్సనల్ లోన్ టాపప్ చేయిస్తానని చెప్పి ఒక లక్షా 27 వేల 281 రూపాయలు తన అకౌంట్‌లోకి మార్చుకొని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ జడ్చర్ల మండలం మాచారం గ్రామానికి చెందిన నెయ్యల రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. నెయ్యల రాజు రెండు సంవత్సరాల క్రితం పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకుకు వెళ్తుండగా అరుణ్‌రాజ్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. అంతకుముందే అరుణ్‌రాజ్ పర్సనల్ లోన్ ఇప్పించాడని, మళ్లీ పర్సనల్ లోన్ ఇప్పిస్తానని, అందుకు మూడు నెలవారీ కిస్తులను రాజు నుంచి రూ.ఒక లక్షా 27వేల 281 ఫోన్‌పే ద్వారా జమ చేయించుకున్నాడని తెలిపారు. లోన్ టాప్ అప్ ఇప్పించకుండా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమోహన్ వివరించారు.

అటవీ ప్రాంతంలో కోతులకు తినుబండారాలు వేస్తే జరిమానా

మన్ననూర్, మార్చి 20 : నల్లమల పులుల అభయారణ్య ప్రాంతాల్లోని మన్ననూరు, వటవర్లపల్లి, దోమలపెంట రేంజ్‌ల పరిధిలో గల రహదారులపై సంచరించే కోతులకు పర్యాటకులు తినుబండారాలు వేయడం పూర్తిగా నిషేధించామని, ఎవరైనా తినుబండారాలను వేస్తే అటవీశాఖ ద్వారా రూ.10 వేలు జరిమానా విధించనున్నట్లు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి తెలిపారు. అభయారణ్యంలో కోతుల సంచారం అధికమైందని, పర్యాటకులు విచ్చలవిడిగా తినుబండారాలు వేయడంతో కోతులు అడవిని వదిలి జనావాసాల్లోకి వచ్చి ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయన్నారు. కోతులకు తినుబండారాలు వేయొద్దనే నోటీసు బోర్డులను మన్ననూరు నుంచి దోమలపెంట వరకు రహదారిపై ఏర్పాటు చేశామన్నారు.

గ్రామాల సుభిక్షం కోరుతూ 29 ఏళ్లుగా శ్రీశైలం పాదయాత్ర

- ఐదుగురితో మొదలై 900 మందితో మల్లన్న మహా పాదయాత్ర


శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్న మహా పాదయాత్ర బృందం

మన్ననూర్, మార్చి 20 : తమ గ్రామాలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతీయేటా పాల్గుణ మాసంలో కుటుంబాల సమేతంగా శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం మహా పాదయాత్ర చేపడుతున్నారు. 29 ఏళ్ల క్రితం ధనసిరి గ్రామంలో ఐదుగురు శివభక్తులతో ప్రారంభమైన పాదయాత్ర 29 ఏళ్లుగా విజయవంతంగా కొనసాగుతోంది. వారి పాదయాత్ర బుధవారం అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చేరుకుంది. స్థానిక వేణుగోపాలస్వామి, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, నల్లమల అభయారణ్యం గుండా శ్రీశైలానికి పాదయాత్ర బృందం తరలి వెళ్లింది. తమ బృందం రోజుకు 30 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తామని, తమకు రెండు పూటలా ఆహారాన్ని తామే గ్రామాల నుంచి తీసుకువచ్చిన సరుకులతో వంటలు తయారు చేసుకొని సామూహికంగా భోజనాలు చేస్తామని పాదయాత్ర బృందం స్వామీజీ వీరేశ్వర శివాచార్యులు తెలిపారు. ఈనెల 22న శ్రీశైల మల్లన్న దర్శనం చేసుకొని తిరిగి బస్సుల్లో తమ గ్రామాలకు వెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహా పాదయాత్ర సమితి సభ్యులు వెంకట్రామిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయం

- ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ జాతీయ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్
- 35వ వసంతాల ఉత్సవాల్లో ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థుల ఎక్స్‌పో
- వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన పాఠశాల విద్యార్థులు
- చైర్మన్, ప్రిన్సిపాల్ హర్షం


వండర్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డును స్వీకరిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్‌గౌడ్

ఆత్మకూరు, మార్చి 20 : ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయమని ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ జాతీయ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. ఎంవీ రామన్ పాఠశాల ప్రారంభించి 35 సంవత్సరాలు అవుతున్నందున 1500 మందికి పైగా విద్యార్థులు 650కి పైగా వివిధ అంశాలపై ప్రదర్శనలు చేశారు. ప్రదర్శనను సంస్థ జాతీయ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, తెలంగాణ కోఆర్డినేటర్ అరుణ్ సిద్ధం తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సామాజిక అంశాలు, సైన్స్, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరవీరుల జ్ఞాపకాలు, తెలుగు రాష్ట్రాల్లో చేపడుతున్న వివిధ పండుగలు, జానపద, తోలు బొమ్మలు, బుర్రకథలు, రామాయణం, తెలుగు నెలలు, నీతి బోధనలు, సంస్కృతి, సంప్రదాయాలు వంటి వివిధ కళారూపాలను వారు తిలకించారు. ఆత్మకూరులో ఇంతటి కళా ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు, అలాగే పాఠశాల యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బింగి నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో చూడాల్సిన ప్రతిభను ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థులు ఇచ్చారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభకు గాను ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డును పాఠశాల చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ హ్యాస్సీశ్రీధర్‌కు అందజేశారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

ఇష్టపడి చదివితేనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించే అవకాశం ఉందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన కళా ప్రదర్శనలను తిలకించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజ పోకడకు నిదర్శనంగా విద్యార్థులను అంగ్లంలో తీర్చిదిద్దిన ఎంవీ రామన్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్‌గౌడ్‌ను అభినందించారు. అనంతరం కరస్పాండెంట్ శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా చేసుకుని విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులకు నిరాశ

- తగ్గుముఖం పడుతున్న ధర
- గరిష్ఠంగా రూ.1500, కనిష్ఠంగా రూ.950


మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

దేవరకద్ర, మార్చి 20 : ఉల్లి ధరలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో రైతన్న నిరాశ చెందుతున్నాడు. పాలమూరు జిల్లాలోని దేవరకద్ర మార్కెట్‌యార్డు ఉల్లి క్రయ విక్రయాలకు పేరుగాంచింది. బుధవారం దేవరకద్ర మార్కెట్ యార్డులో జరిగిన లావాదేవీల్లో ఉల్లి ధర గరిష్ఠంగా రూ.1500, కనిష్ఠంగా రూ.950 ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరీ ఎల్లయ్య తెలిపారు. ప్రస్తుతం ఉల్లికి సీజన్ కావడంతో మార్కెట్‌కు దిగుబడి అధికంగా వస్తోంది. అయితే, మార్కెట్‌కు వచ్చిన ఉల్లిలో తెల్లగా, నాణ్యంగా ఉన్నవాటికి కొంతవరకు డిమాండ్ ఉండగా, ఎర్ర ఉల్లిని కొనేవారు కరువయ్యారు. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని కొనుగోలు చేశారు. బుధవారం మార్కెట్‌కు 865 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ సెక్రటరీ తెలిపారు.

పోటాపోటీగా వేలం

దేవరకద్ర మార్కెట్‌యార్డులో బుధవారం అధిక మొత్తంలో ఉల్లి దిగుబడులు వచ్చాయి. ఉల్లికి వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. నాణ్యంగా ఉన్న ఉల్లికి బాగా డిమాండ్ ఉండడంతో క్వింటాల్ ధర గరిష్ఠంగా రూ.1500, కనిష్ఠంగా రూ.950, రెండో రకం ఉల్లికి ధర గరిష్ఠంగా రూ.1225, కనిష్ఠంగా రూ.600 వరకు విక్రయించారు. అయితే, ధర తక్కువగా పలకడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. క్వింటాల్‌కు కనీసం రెండు వేల నుంచి రెండున్నర వేలకు పైగా ధర పలికినట్లయితే తమకు కొంతవరకైనా గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఖిల్లా విద్యార్థి ఎంపిక


అశోక్

ఖిల్లాఘణపురం, మార్చి 20 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మల్కిమియాన్‌పల్లి గ్రామ పరిధిలోని దేవబండతండాకు చెందిన డిగ్రీ విద్యార్థి అశోక్ పారా ఒలింపిక్ వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. దివ్యాంగులకు నిర్వహించే రాష్ట్ర స్థాయి ఒలింపిక్స్ వాలీబాల్ క్రీడల్లో ఎడమ చేయి లేని అశోక్ ఈనెల 17వ తేదీన నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఒక్కడే ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి 12 మంది జాతీయ స్థాయి పారా ఒలింపిక్ వాలీబాల్ క్రీడలకు ఎంపికవగా అశోక్ ఒంటి చేతితో వాలీబాల్ షాట్లు కొడుతూ అబ్బురపరిచి ప్రతిభ చాటాడు. ఈనెల 29, 30, 31వ తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి పారా ఒలింపిక్ వాలీబాల్ పోటీల్లో అశోక్ పాల్గొని ప్రతిభ చాటాలని మండల క్రీడాకారులు ఆకాంక్షించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన అశోక్ అంగవైకల్యాన్ని లెక్క చేయకుండా నిరంతరం వాలీబాల్ క్రీడలో సాధన చేసి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికై పలువురికి ఆదర్శంగా మారాడని అథ్లెటిక్స్ జాతీయ క్రీడాకారుడు, పీఈటీ దేవేందర్ తెలిపారు.

చైర్మన్ సేవలను కొనియాడిన పూర్వ విద్యార్థులు



ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌ను సన్మానిస్తున్న మిత్ర బృందం

అచ్చంపేట రూరల్, మార్చి 20 : శ్రీశైలం ఉత్తర ద్వారంగా ప్రఖ్యాతి గాంచిన ఉమామహేశ్వర స్వామి పుణ్యక్షేత్రాన్ని అన్ని రకాల సదుపాయాలతో అభివృద్ధి చేసిన ఆలయ చైర్మన్ కందూరి సుధాకర్‌ను అతని మిత్ర బృందం కొనియాడి నిత్యాన్నదానానికి తమవంతుగా 25వేల 116రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని 1974 పదవ తరగతి, 1976 ఇంటర్ పూర్వ విద్యార్థులంతా సందర్శించి స్వామి వారిని దర్శించుకుని పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమ చిన్ననాటి మిత్రుడు, ప్రస్తుత ఆలయ చైర్మన్ అయిన కందూరి సుధాకర్ క్షేత్ర అభివృద్ధికి చేసిన కృషికి, నిత్యాన్నదానానికి ముగ్దులై నిత్యాన్నదానానికి తమవంతుగా ఆర్థిక సహాయాన్ని చైర్మన్‌కు, ఆలయ ఈవో శ్రీనివాస్‌రావుకు అందజేశారు.

ఘనంగా మాజీ సర్పంచ్ విశ్వనాథం జయంతి



దుగ్గి విశ్వనాథం స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

చారకొండ, మార్చి 20: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ దుగ్గి విశ్వనాథం 71వ జయంతి వేడుకలను సీపీఐ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చెర్కుపల్లి చౌరస్తాలో దుగ్గి విశ్వనాథం స్తూపం వద్ద సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ చిలివేరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వనాథం 14 సంవత్సరాలు చారకొండ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేసి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. దుగ్గి అనిల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాం గౌడ్, నాయకులు మద్ది నారాయణరెడ్డి, మస్న పాండు, బ్రహ్మం, శంకరయ్య లెనిన్‌బాబు, విష్ణు, మైబెలి, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములు కావాలి



మునిసిపల్ కమిషనర్, చైర్మన్‌కు రూ.80వేల చెక్కు అందజేస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తి, మార్చి 20 : కల్వకుర్తి మునిసిపల్‌లో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డిలు కోరారు. కల్వకుర్తి మునిసిపల్‌లో చెత్తబుట్టల కొనుగోలుకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డి రూ.80 వేల చెక్కును చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలుంటాయని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తబుట్టల్లోనే చెత్త వేసి మునిసిపల్ చెత్తసేకరణ బండ్లకు అందించాలని ఆశాదీప్‌రెడ్డి సూచించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ షాహేద్, కౌన్సిలర్ సైదులుగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అనిల్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలి

కల్వకుర్తి, మార్చి 20 : ఎన్నికల నియమావళికి లోబడి ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ ప్రతినిధులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్.శ్రీను మాట్లాడుతూ ఏప్రిల్ 15నాటికి 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఫామ్-6 ద్వారా ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హోం ఓటింగ్‌కు 80సంవత్సరాలు నిండిన వృద్ధులు, పీడబ్ల్యూడీ ఓటర్లు ఫామ్-12బిలో అప్లికేషన్ పెట్టుకోవాలని సూచించారు. దీంతో వారి ఓటును హోం ఓటింగ్ ప్రక్రియ ద్వారా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎలక్షన్ డీటీ అనిత, వివిధ రాజకీయ ప్రతినిధులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీవో

వంగూరు, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వంగూరు, కొండారెడ్డిపల్లి తదితర గ్రామాలను బుధవారం అచ్చంపేట ఆర్డీవో మాధవి పోలింగ్ బుత్‌లను పరిశీలించారు. మండలంలో ఉన్నా 36 పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు ఇబ్బంది కల్గకుండా పోలింగ్ బూత్‌ల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ కిరణ్మయికి ఆదేశించారు. బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఆర్‌ఐలు, బీఎల్‌వోలు ఉన్నారు.

పశువుల సంత వేలం రూ.68 లక్షల 3వేలు

తెలకపల్లి, మార్చి 20 : తెలకపల్లి పశువుల సంత వేలం పాట బుధవారం గ్రామపంచాయతీ దగ్గర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పశువుల సంత వేలం పాట 68లక్షల 3వేలకు మధుకర్‌రెడ్డి అనే వ్యక్తి దక్కించుకున్నాడు. తైబజార్ 6లక్షల 6100 రూపాయలకు ఆర్.సతీష్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. బస్టాండ్ ఆవరణలో ఉన్న వాణిజ్యం దుకాణం నెలకు 39వేల చొప్పున వేలం పాట నిర్వహించారు. ఈవో భాస్కర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ వాహనాలను తనిఖీ చేసిన ఎస్పీ



పోలీస్ వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 20 : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న పోలీస్ వాహనాలను ఆఫీస్ ముందు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపే డ్రైవర్లకు ఏ విధంగా వాహనాలను నడపాలో ఎలా మెయింటైన్ చేయాలి... అదేవిధంగా ఎన్నికలు ఉన్న నేపథ్యంలో అనునిత్యం పరిశీలనలో ఉండే విధంగా ఎలాంటి సమస్యలు వచ్చినా అప్పటికప్పుడు క్లియర్ చేసుకోవాలని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అలాగే డ్రైవర్ చేయాల్సిన, చేయకూడని పనులను వివరించారు. పోలీస్ డ్రైవర్లందరికీ ఎస్పీ దిశా నిర్దేశాలు చేశారు. అడిషనల్ ఎస్పీ భరత్, ఏఆర్ డీ ఎస్పీ నరసింహాచారి, ఆర్‌ఐలు రాఘవరావు, జగన్, ఆర్ఎస్ఐ గౌస్‌పాషా పాల్గొన్నారు.

'పరిశ్రమల స్థాపనపై యువతకు అవగాహన'

బిజినేపల్లి, మార్చి 20 : వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే నిరుద్యోగ గ్రాడ్యుయేట్ యువతకు వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నూనె గింజల శాస్త్రవేత్త డాక్టర్ వల్లపు దివ్య బుధవారం తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఐసీఏఆర్, భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మైక్రోబియల్ బయోపెస్టిసైడ్స్, ఆయిల్ ప్రాసెసింగ్ యూనిట్లు, సేంద్రియ వ్యవసాయ వనరులు వంటి వాటిని స్థాపించేందుకు అవసరమైన అంశాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. వాటి స్థాపనకు అవసరమైన పెట్టుబడి రుణాలు, సబ్సిడీ పథకాల గురించి నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, ఏజీ హబ్ సీఈవో విజయ్‌లు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

మంత్రి జూపల్లిని సన్మానించిన న్యాయవాదులు



కొల్లాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ చాంబర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానిస్తున్న న్యాయవాదులు

కొల్లాపూర్, మార్చి 20 : కొల్లాపూర్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ చాంబర్‌లో బుధవారం బార్ అసోసియేషన్ సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావును శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి దృష్టికి న్యాయవాదులు పలు సమస్యలను తీసుకొచ్చారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న చిన్నంబావి, వీపనగండ్ల మండలాలను కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్‌లోకి చేర్చాలని కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో సబ్ కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కోర్టుకు వచ్చే కక్షిదారులకు కోర్టు ఆవరణలోనే మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వసతులు కల్పించాలని, కక్షిదారులు కూర్చునేలా కోర్టు ప్రాంగణంలో షెడ్ ఏర్పాటు చేయాలని, శిథిలావస్థకు చేరిన భవనాలను మరమ్మతులు చేయాలని న్యాయవాదులు మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరెడ్డి, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసరావు, ఉపేందర్, భుజాల భాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు శివారెడ్డి, ఫిరంగి గోవిందు, నజీరుద్దీన్, తిప్పరాజుల రాఘవేంద్ర, తిప్పరాజుల కురుమూర్తి, బాలస్వామి, శ్రీహరి, రామలక్ష్మమ్మ, చిన్న కుర్మయ్య, వెంకటస్వామి, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జూపల్లికి పీజీ కళాశాల విద్యార్థుల వినతి

పాలమూరు యూనివర్సిటీ కొల్లాపూర్ పీజీ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి, ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావుకి పీజీ కళాశాల విద్యార్థులు లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల ఏర్పాటు నుంచి నేటి వరకు వసతి గృహంలో విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేయలేదని, వివిధ ప్రాంతాల నుంచి ఉన్నత విద్యనభ్యసించేందుకు వచ్చిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వసతి గృహాల రూముల్లో విద్యార్థులే భోజనాలు ఏర్పాటు చేసుకుంటున్నారని అదేవిధంగా క్రీడారంగంలో విద్యార్థులు రాణించేందుకు కళాశాల ఆవరణలో ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేయాలని మంత్రి జూపల్లిని కళాశాల విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు కోరుతూ లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. టీఆర్ఎస్‌వీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు బి.శేఖర్, పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ బత్తిని రాము, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు భరత్‌యాదవ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి రైతులు జాగ్రత్తలు పాటించాలి



పెద్దకార్పాముల గ్రామంలో మామిడి చెట్లను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి డి.చక్రపాణి

పెద్దకొత్తపల్లి, మార్చి 20 : మామిడి రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తే దిగుబడులు సాధించి అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి డి.చక్రపాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలోని పలు మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మామిడి సాగులో మెలకువలు పాటించాలని ఆయన సూచించారు. మామిడి పంటల ఎగుమతి, మధ్యవర్తులు లేకుండా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా నేరుగా రైతులే దేశీయంగా మరీ విదేశాలకు ఏ విధంగా ఎగుమతి చేయాలో రైతులకు క్షుణ్ణంగా వివరించారు. అంతేకాకుండా మామిడి రైతులు కాయలకు ఫ్రూట్ ప్రొటెక్షన్‌కవర్లను అమర్చుకోవాలని, దాని ద్వారా మసీ మంగు ఒక కాయ నుంచి మరొక కాయకు వ్యాప్తి చెందకుండా ఉంటుందని ఆయన అన్నారు. అకాల వర్షాలకు కాయలు రాలకుండా కాడ పట్టి ఉంచడం ద్వారా రైతులు అకాల వర్షాల నుంచి నష్టం వాటిల్లకుండా ఉంటుందని ఆయన సూచించారు. ప్రతీ ఏడాది కాయ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ ప్రొటెక్షన్ కవర్లను అమర్చుకుని అమర్చిన 55 నుంచి 60రోజుల తర్వాత తీసివేయడం ద్వారా కాయ మంచి సైజు, బంగారు వర్ణం కలిగిన రం గు రావడం ద్వారా మార్కెట్‌లో మంచి ధర పలికి రైతు కు మంచి ఆదాయం చేకూరుతుందన్నారు. అనంతరం కొల్లాపూర్ మండలంలోని పలు ఆయిల్‌పామ్ తోటలను కూడా ఆయన పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన వెంట కొల్లాపూర్ డివిజన్ ఉద్యానవన అధికారి ఎం.లక్ష్మణ్, నాబార్డు ఎఫ్‌పీవో కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఆయిల్‌పామ్ క్లస్టర్ ఆఫీసర్లు మహేష్, చంద్రశేఖర్‌లు ఉన్నారు.

పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీ గుర్తింపు



తిమ్మాజిపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబురాలు

తిమ్మాజిపేట, మార్చి 20 : కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసి పార్టీ బలోపేతానికి ఎంపీ టికెట్ డాక్టర్ మల్లురవికే కేటాయించడం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్ బహదూర్ హర్షదాయకమన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర బుధవారం ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు డాక్టర్ మల్లురవికి ఎంపీ టికెట్ కేటాయించడంపై సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటూ పిలిస్తే పలికే మల్లురవికే టికెట్ కేటాయించడంతో గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాధవులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉస్మాన్‌రవూఫ్, హర్షవర్ధన్‌రెడ్డి, దేవస్వామి, మనోహర్, సహదేవ్, ఆనంద్‌చారి, మల్లేష్‌ముదిరాజ్, జంగయ్య, వెంకట్రాములు, రాఘవేందర్, తిరుపతిరెడ్డి, వరుణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

మల్లురవికి టికెట్ కేటాయించడంపై హర్షం

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ టికెట్ డాక్టర్ మల్లురవికి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటించడం పట్ల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చింతలపల్లి ప్రకాశ్‌యాదవ్, శారద రాజమౌళిలు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ మల్లురవి గత 30సంవత్సరాలుగా ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ విజయం కోసం పోరాడే వ్యక్తి అని వారు కొనియాడారు. పార్లమెంట్ అభ్యర్థిగా మల్లురవికి టికెట్ రావడం ఎంతో హర్షదాయకమని, అధిక మెజార్టీతో గెలిపించి సోనియమ్మ రుణం తీర్చుకుందామని వారన్నారు.

చెంచు పెంటలను సందర్శించిన ఎన్ఐఆర్‌డీపీఆర్ బృందం



ఎన్ఐఆర్‌డీపీఆర్ బృందానికి స్వాగతం పలుకుతున్న సార్లపల్లి, కుడిచింతలబావి చెంచులు

దోమలపెంట, మార్చి 20 : నల్లమలలో జీవిస్తున్న చెంచు గిరిజనుల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు ఎన్ఐఆర్‌డీపీఆర్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్) బృందం బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం సార్లపల్లి చెంచుపెంటకు చేరుకుంది. ఈ సందర్భంగా చెంచులతో ఎన్ఐఆర్‌డీపీఆర్ హైదరాబాద్ బృందం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యరంజన్ మహకుల్ ఆధ్వర్యంలో 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఐదు బృందాలుగా ఏర్పడి చెంచులతో సమావేశం అయ్యారు. నల్లమల అటవీ ప్రాంతంలో జీవించే చెంచుల జీవన విధానం, వారికి లభించే అటవీ ఉత్పత్తులు, వాటి సేకరణ, విక్రయం, ఉపయోగాల గురించి ఎన్ఐఆర్‌డీపీఆర్ బృందం సభ్యులు తెలుసుకున్నారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యరంజన్ మహకుల్ మాట్లాడుతూ దేశంలోనే చెంచు జాతి అరుదైనదని, వీరి సంఖ్య రోజురోజుకు క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనువాసులు, అమ్రాబాద్ ఎంపీడీవో మోహన్‌లాల్, టీపీ రేణయ్య, పంచాయతీ కార్యదర్శులు సూర్య రాంబాబు, గ్రామస్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



బీఆర్ఎస్ నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డీకే అరుణ

ఊర్కొండ, మార్చి 20: మాజీ మంత్రి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. బుధవారం దేవరకద్ర నియోజకవర్గ చిన్న రాజమూరులో మహబూబ్ నగర్ బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డీకే అరుణ, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముచ్చర్ల లక్ష్మారెడ్డి, శివేందర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, బండి మలేష్, సందీప్, నిలకంఠేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

'న్యూలైఫ్ క్లినిక్ లైసెన్స్ రద్దు చేయాలి'

బిజినేపల్లి, మార్చి 20 : జిల్లా కేంద్రంలో స్థాయికి మించిన వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్ఎంపీ డాక్టర్ షమీ, న్యూలైఫ్ క్లినిక్‌ల లైసెన్స్ రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని గుడ్లనర్వ గ్రామంలో వైద్యం వికటించి మంచానికే పరిమితమైన బాధితుడు అరవింద్‌ను బుధవారం ఏఐటీయూసీ నాయకులు పరామర్శించి మాట్లాడారు. ఇంటర్ చదువుతున్న బాధితుడు అరవింద్ కిడ్నీ సమస్యతో ఆసుపత్రికి వెళ్తే నాటు మందులతో వచ్చి రాని వైద్యం చేయడంతో రోజు రోజుకు శరీర బరువు కోల్పోయి లేవలేని దుస్థితికి వచ్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాపాయ స్థితికి తీసుకొచ్చిన ఆర్ఎంపీ షమీని, న్యూలైఫ్ క్లినిక్‌లను మూసి వేసి లైసెన్స్ రద్దు చేయడంతో పాటు బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

'ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్రం విఫలం'

అచ్చంపేట రూరల్, మార్చి 20 : యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం పదేళ్లలో యువతను మోసం చేసిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వర్దం సైదులు అన్నారు. బుధవారం అచ్చంపేట మండలం లింగోటం గ్రామంలో యువకులతో సమావేశం నిర్వహించి డీవైఎఫ్ఐ నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ అధ్యక్షుడు ఆంజనేయులు, గ్రామ ప్రధాన కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, కమిటీ సభ్యులు రవి, జీసస్, మహేష్, లింగం, సంతోష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో టాస్క్ శిక్షణ తరగతులు ప్రారంభం

కొల్లాపూర్, మార్చి 20 : తెలంగాణ అకాడమీ స్కిల్స్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రత్యేక శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఇటికాల రాములరాజుయాదవ్ అధ్యక్షత వహిస్తూ ప్రతి పోటీ పరీక్షలకు మెంటల్ ఎబిలిటీ రీజనింగ్ ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. కళాశాల టాస్క్ కన్వీనర్ టి.వెంకటయ్య స్వాగత వచనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని వెంకటయ్య పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులకు ప్రత్యేక శిక్షకులుగా సి.వెంకటేష్, రీసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరిస్తూ పలు అంశాలపై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. కళాశాల అధ్యాపకులు కుర్మయ్య, రమేష్‌కుమార్, స్వర్ణలత, సింధు, స్వామి, సాగర్, జగన్నాథం, సోఫిపాషా, సవిత, వసుందర, మౌనిక, అనితలతోపాటు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించండి

- రైస్ మిల్లర్లకు అదనపు కలెక్టర్ కె.సీతారామారావు ఆదేశం

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 20: ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని తక్షణమే ప్రభుత్వానికి అప్పగించాలని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు మిల్లర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లలతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20-21, 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ బియ్యాన్ని తక్షణమే అందజేయడంతో పాటు 2023-24 సంబంధించి బియ్యాన్ని ఏప్రిల్ 30 లోగా అప్పగించాలని ఆదేశించారు. నిర్దేశించిన తేదీలోగా మిల్లర్లు వారి వద్ద ఉన్న బియ్యం అప్పగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌర సంబంధాల అధికారి స్వామికుమార్, సివిల్‌సప్లై జిల్లా మేనేజరు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కోడేరు, మార్చి 20 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనమందించాలని మండల తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ జయలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్స్‌లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని ఇవ్వాలని, విద్యార్థులకు విద్యాబోధనలో కూడా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యనందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న తరుణంలో పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలను గురించి పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణ అధికారి కృష్ణయ్యలు ఉన్నారు.

పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి

-ఎమ్మెల్యే వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, మార్చి 20: పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ముగ్గురిపై కేసు నమోదు

లింగాల, మార్చి 20: గ్రామాల్లో లైసెన్స్‌లు లేకుండా అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని ఎస్సై జగన్‌మోహన్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి పోలీస్ సిబ్బందితో కలిసి మండల పరిధిలోని అప్పాయిపల్లి, రాంపూర్ గ్రామాల్లోని కిరాణం షాపులలో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా అమ్మకాల కోసం నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లు లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఆయా షాపుల యజమానులు భానుప్రకాష్, శ్రీకాంత్, చంద్రశేఖర్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 20 : అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ పట్టణంలోని నాగనూల్ రోడ్డులో అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

పంటలు ఎలా ఉన్నాయి

- పల్లీ రైతులతో మంత్రి జూపల్లి మాటామంతీ

కొల్లాపూర్, మార్చి 20 : పంటలు ఎలా ఉన్నాయి, పల్లీలు బాగానే వచ్చాయా అంటూ వ్యవసాయ పొలంలో పని చేస్తున్న పల్లీ రైతులను, మహిళా కూలీలను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆప్యాయంగా పలకరించారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలో మార్నింగ్‌వాక్‌లో భాగంగా పట్టణ శివారులో ఉన్న ఓ వ్యవసాయ పొలంలో పల్లీ పంటను తెంపుతున్న రైతులతో, మహిళా కూలీలతో మంత్రి ముచ్చటించారు. వేరుశనగ పంట దిగుబడి, మద్దతు ధర, కూలీ రేట్లను మహిళలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ పొలంలో ఉన్న మహిళలు కొల్లాపూర్ పట్టణంలో తమ కాలనీల్లో సరఫరా అవుతున్న నల్లానీళ్లు కొన్ని రోజులుగా రుచి, వాసన మారిపోయి వస్తున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మునిసిపల్ అధికారులకు ఫోన్ చేసి నీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, వాటర్ ట్యాంకులను వెంటనే శుభ్రపర్చాలని ఆదేశించారు.

ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సభ్యుడు హనుమంతు నాయక్, మాజీ సర్పంచ్ నాగరాజు, నాయకులు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎండీ.ఎక్బాల్, కృష్ణమనాయుడు, వంగ రాజశేఖర్‌గౌడ్, రమేష్‌ముదిరాజ్, రామన్‌గౌడ్, రెడ్డి సత్యం, కిశోర్, భాను, ఖాద్రి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి

ఉప్పునుంతల, మార్చి 20 : విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రతి రోజు 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్సీ లీలావతి విద్యుత్ అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని విద్యుత్ సబ్‌స్టేషన్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగాగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ప్రతి రోజు 24 గంటల సరఫరా చేస్తున్నామని తెలిపారు. తెల్లరేషన్ కార్డు కల్గిన వారి నుంచి ఎలాంటి బిల్లులు వసూలు చేయరాదని వారు సూచించారు. విద్యుత్ అక్రమంగా వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. ఏడీ కామేశ్వర్‌రావు, ఏఈ అమరేందర్ సింగ్, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కురపయ్య ఉన్నారు.

'గత ప్రభుత్వంలోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు'

కొల్లాపూర్, మార్చి 20 : రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా వివిధ నోటిఫికేషన్లు ఏర్పాటు చేసి గత ప్రభుత్వమే పరీక్షలు నిర్వహించిందని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు డీకే మాదిగ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసి కాంగ్రెస్ ప్రభుత్వమే ఉద్యోగాలిచ్చిందని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కొత్తగా ఉద్యోగ నోటిఫికేషన్లు వేసి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

తిమ్మాజిపేట, మార్చి 20 : నాగర్‌కర్నూల్ రెవెన్యూ డివిజనల్ అధికారి కే.సురేష్ బుధవారం తిమ్మాజిపేట మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఇప్పలపల్లి, రాళ్లచెరువుతండా, ఆవంచ, బుద్ధసముద్రం, నేరేళ్లపల్లి, మారేపల్లి, ఎదిరేపల్లి, మరికల్, గుమ్మకొండ, బావాజీపల్లి, కొడుపర్తి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి పరిసరాలను పరిశీలించి కనీస వసతులపై ఆరా తీశారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ జేకే.మోహన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, మురళి, రవి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

కోడేరు, మార్చి 20 : గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం చాలా అవసరమని కొల్లాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కోడేరు మండల సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎత్తం గ్రామంలో 3వ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, అగ్నివీర్ వాయుసేన ఎంపిక కోసం అవగాహన

బల్మూరు, మార్చి 20: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, అగ్నివీర్ వాయుసేనలో చేరడానికి అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు, యువతీ యువకులకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఈ నెల 22న శుక్రవారం ఉదయం 10గంటలకు కళాశాలలో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

జూపల్లిలో ఇఫ్తార్ విందు

చారకొండ, మార్చి 20: రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు బుధవారం మండల పరిధిలోని జూపల్లిలో మాజీ ఉపసర్పంచ్ కలమందల జగపతి ఇఫ్తార్ విందు ఇచ్చారు. అంతకుముందు ముస్లింలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు రవి, సైదులు, ముస్లింలు బిక్కన్, అబ్దుల్లా, అజీమ్, రీయాజ్, సీరాజ్ పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

కల్వకుర్తి, మార్చి 20 : గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మనోహర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖల వారిగా సమీక్షలు జరిగాయి.

పండ్లలో పుష్కలంగా పోషకాలు

బిజినేపల్లి, మార్చి 20 : నిత్యం తీసుకునే ఆహారంలో విరివిగా పండ్లను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని ఎన్ఎస్ఎస్ అధికారి సాధన అన్నారు. మండలంలోని గంగారంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ఐదవ రోజు బుధవారం వివిధ పండ్లను జ్యూస్ చేసే విధానాన్ని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామస్థులకు ప్రత్యేక్షంగా చేసి చూపించారు. రక్తహీనత తగ్గించడంతో పాటు రోగ నిరోధక శక్తి మెరుగు పర్చుకునేందుకు వివిధ రకాల పండ్లను జ్యూస్‌గా చేసుకొని తీసుకోవాలని వివరించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

పెద్దకొత్తపల్లి, మార్చి 20 : మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. పెద్దకార్పాముల గ్రామంలో దాడులు నిర్వహించి ఆరు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా ట్రాన్స్‌పోర్టు సీఐ కల్యాణ్, కొల్లాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి'

మన్ననూర్, మార్చి 20: నాగర్‌కర్నూలు పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలంతా ఐక్యమత్యంతో కృషి చేయనున్నట్లు డీసీసీ కార్యదర్శి సంభు వెంకట్‌రమణ, ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు రహీం, ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణలు అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు పెర్ముల వెంకటేశ్వర్లు, లోకనాధం, రమణగౌడ్, శివాజీ, హన్మంతురెడ్డి, రహిమాన్, తుల్స్యా తదితరులు పాల్గొన్నారు.